క్లుప్తంగా

స్వామియే శరణం అయ్యప్పా..!



శబరిమలైకు వెళ్తున్న స్వాములు

సదుం: మండలంలో పలువురు ఇటీవల అయ్యప్పదీక్ష ధారణ చేశారు. వారు మంగళవారం ఎర్రాతివారిపల్లె అయ్యప్పస్వామి ఆలయాన్ని దర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఇరుముడులు కట్టి శబరిమలై యాత్రకు బయలుదేరారు. తామంతా తిరుపతికి వెళ్లి అక్కడి నుంచి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి శబరిమలై వెళ్లనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, సింగిల్‌విండో మాజీ వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, రమణా రెడ్డి తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో అదుర్స్



కరాటేలో చాంపియన్‌షిప్ సాధించిన మదర్ థెరిసా విద్యార్థులు

పెద్దపంజాణి: ఇటీవల ఒంగోలులోని పర్వత రెడ్డి ఆనంద్ మినీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని మదర్ థెరిసా పాఠశాల విద్యార్థులు చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్టు ఆ స్కూల్ విద్యాసంస్థల చైర్మన్ రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యాసంస్థల విద్యార్థులు 6 స్వర్ణ, 7 రజత, 15 కాంస్య పతకాలు సాధించారని, వీరికి టీమ్ ఇండియా కరాటే హెడ్ కోచ్ కీర్తన కొండూరు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారని తెలియజేశారు. సత్తా చాటిన విద్యార్థులను, కరాటే మాస్టర్ సదాశివను ప్రిన్సిపాల్ డేవిడ్ అభినందించారు.

జొన్న విత్తనాల పంపిణీ



పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు

గుడుపల్లె: వర్షాభావ పరిస్థితుల్లో పశుగ్రాసం కోసం మొక్క జొన్న విత్తనాలను రాయితీపై పంపిణీ చేస్తున్నట్టు పశువైద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం గుడిపల్లెలో మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. పశుగ్రాసం కోసం 11 టన్నుల మొక్కజొన్న విత్తనాలు, 3 టన్నుల జొన్న విత్తనాలు మండలానికి వచ్చాయని, మొక్కజొన్న 5 కిలోలు రాయితీపోను రూ.85, జొన్న విత్తనాలు 5 కిలోలు రూ.115లకు ఇస్తామన్నారు. ఒక్కో రైతుకు 20 కిలోల వరకు ఇస్తామన్నారు. విత్తనాలు కావలసిన పాడి రైతులు గుడుపల్లె రైతు సేవా కేంద్రంలో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జెరాక్సుతో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు టీఎం బాబునాయుడు, సింగిల్‌విండో చైర్మన్ రమేష్, రైతులు పాల్గొన్నారు

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



లూయిస్ డాగూరే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

పుంగనూరు: పట్టణంలోని ఫొటోగ్రాఫర్లు మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫర్లు ఉదయ్‌కుమార్, అశోక్, శేఖర్, బోస్, వేణు, నరేష్, హరి, మోహన్, బాలాజి, ముని, కేశవ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: పట్టణాల్లో సంపూర్ణ అక్షరాస్యతే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉల్లాస్–అక్షరాంధ్ర అర్బన్ లెవల్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఆయన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని నిరక్షరాస్యులను 2029లోపు అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వం పూనుకుందన్నారు. స్థానిక మున్సిపాలిటీలో ఇప్పటి వరకూ 6,200మంది నిరక్షరాస్యులు ఉన్నట్టు గుర్తించామన్నారు. వారందరినీ విద్యాశాఖ, మెప్మా, ఐసీడీఎస్ ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కోరారు.

కడుపు కొడుతున్న రోడ్డు విస్తరణ

కుప్పం పట్టణం నడిబొడ్డున ఉన్న నేతాజీ రోడ్డు విస్తరణ పనులు బాధితులకు శాపంగా మారాయి. గతంలో ఆగిన రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉపక్రమించింది. దీంతో గతంలో చేసిన సర్వేలు, మార్కింగ్‌లు పక్కన పెట్టి కొత్త ప్లానింగ్‌తో చేస్తున్న సర్వే తీరు విమర్శలకు తావిస్తోంది. అధికార యంత్రాగం ఒక్కో రకంగా సర్వే, మార్కింగ్ చేస్తుండడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

- రోజుకో సర్వే..మారుతున్న కొలతలు
- నష్ట పరిహారం ఊసెత్తని అధికారులు
- సీఎం న్యాయం చేయాలని బాధితుల నివేదన'



.రోడ్డు విస్తరణతో కోల్పోతున్న ఇల్లు

కుప్పం: పట్టణంలో రోడ్డు విస్తరణకు సంబంధించి ఎంఆర్ రెడ్డి సర్కిల్ నుంచి రైల్వే గేటు వరకు మూడవ రీచ్ పనులు చేపట్టాలి. దీంతో గతంలో 30, 40 అడుగులు మార్కింగ్‌ను ప్రస్తుతం 70 అడుగులకు పెంచుతూ కొత్తగా మార్కింగ్ ఇస్తున్నారు. దీంతో పలు కుటుంబాలు తమ ఇళ్లను పూర్తిగా కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉంటోంది. పట్టణ నడిబొడ్డున ఉన్న నేతాజీ రోడ్డు ఇరువైపులా కొన్ని వందల కుటుంబాలు చిల్లర దుకాణాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాయి.

రోడ్డు విస్తరణకు గాను చిల్లర దుకాణాలతో పాటు నివాస గృహాలకు సైతం మార్కింగ్ ఇవ్వడంతో బాధితులకు దిక్కు తోచడం లేదు. 70 అడుగులకు రోడ్డు విస్తరణలో పూర్తిగా ఇళ్లు, దుకాణాలు కోల్పోతున్న వారికి ఎంత నష్ట పరిహారం చెల్లిస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. దీనిపై బాధితులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా ఐదేళ్ల క్రితం వేసిన ప్లాన్ మార్చి మరోవైపు మళ్లించారు. దీనివల్ల కొద్దో గొప్పో ఉండడానికి ఇళ్లైనా మిగులుతాయని ఆశ పడ్డ వారికి ప్లానింగ్ మార్చడం శాపమైంది. వారంతా పూర్తిగా నిరాశ్రయులయ్యారు. కుప్పంకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దీనిపై దృష్టి సారించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

చావు తప్పితే మరో మార్గం లేదు



నేతాజీ రోడ్డులోని బాలురు ఉన్నత పాఠశాల వద్ద 20 కి 20 చిన్నపాటి ఇల్లునాది. ఇక్కడే పానీపూరి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాం. రోడ్డు విస్తరణలో పూర్తిగా ఇల్లు, దుకాణం పోయి జీవనాధారం కోల్పోతాం. మాకు వేరే పనులు రావు; తెలియవు. వంశపారం పర్యంగా చిల్లర దుకాణాలపై ఆధారపడి బతుకుతున్నాం. న్యాయం చేయాలని ఎవరిని ఆశ్రయించినా ఏమీ చేయడం లేదు. జీవనాధారం కోల్పోయిన మాకు ఇక చావు తప్పితే మరో మార్గం లేదు.

– కిట్టు, పానీపూరి దుకాణదారుడు

హామీలతో బాబు దగా



బాబు షూరిటీ..మోసం గ్యారంటీ పోస్టర్లు విడుదల చేస్తున్న అలీమ్‌బాషా, ఫకృద్దీన్ షరీఫ్, అమ్ము తదితరులు

- 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ'లో ఇంటింటికీ వెళ్లి చాటిచెప్పిన నాయకులు

పుంగనూరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా డిమాండ్ చేశారు. మంగళవారం 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని స్థానిక కుమ్మరవీధి, తూర్పుమొగసాల, మహబూబ్‌నగర్ ప్రాంతాలలో జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ అమ్ము, సీమ జిల్లాల మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఫకృద్దీన్ షరీఫ్‌తో కలసి నిర్వహించారు. చంద్రబాబు నెరవేర్చని హామీలపై వైఎస్సార్ సీపీ విడుదల చేసిన స్కానర్లు, క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ప్రజలకు పంపిణీ చేశారు. అలీమ్‌బాషా మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు అమలు చేయకుండా దగా చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం నేర్పాలని ఇంటింటికీ వెళ్లి కోరారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ఇర్ఫాన్, రాష్ట్ర హజ్ కమిటీమాజీ డైరెక్టర్ ఖాదర్, మున్సిపల్ వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అమరేంద్ర, కౌన్సిలర్లు కాంతమ్మ, గంగులమ్మ, భారతి, పూల త్యాగరాజు, రెడ్డెమ్మ, రేష్మా, నూర్జహాన్, సాజిదాబేగం, నటరాజ, కాళిదాసు, కిజర్‌ఖాన్, జేపీ యాదవ్, నాయకులు జయరామిరెడ్డి, ఇంతియాజ్, మమ్ము, రాఘవ, రషీదాబేగం, జావీద్, బావాజాన్, నయాజ్, అయాజ్, తుంగా కృష్ణమూర్తి, అస్లాం మురాధి , జిమ్ ఇర్ఫాన్, శ్రీనివాసులు, గౌని తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు నెరవేర్చని హామీలను కుమ్మరవీధిలో ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్న అలీమ్‌బాషా, పార్టీ నేతలు

నేడు బెస్తవీధిలో..

బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం బెస్తవీధి నుంచి ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం

పలమనేరు: మండలంలోని మారుమూల గ్రామాల్లో బడుగుల పౌరహక్కుల విషయంలో స్థానిక తహసీల్దార్ ఇన్బునాథన్ సేవలు ఘనమైనవని, మండల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రస్తుతించారు. పంద్రాగస్టు వేడుకల సందర్భంగా జిల్లా స్థాయిలో ఆయన ఉత్తమ తహసీల్దార్‌గా ప్రశంసా పత్రం అందుకున్న నేపథ్యంలో మంగళవారం తహసీల్దార్‌ను ఆయన కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో దళిత మహాసభ నాయకులు కత్తి శ్రీనివాసులు, మానిటరింగ్ కమిటీ సభ్యులు శివాడి గోవిందు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

హరో...హరా..!



వీపునకు కొక్కీలు తగిలించుకుని రథాన్ని లాగుతున్న భక్తుడు

వి.కోట: పట్టణంలోని బసాపురానికి చెందిన పలువురు భక్తులు కావడి మొక్కులతో తిరుత్తణికి బయలుదేరి వెళ్లారు. బసాపురానికి చెందిన భక్తుడు మురళి తన వీపునకు కొక్కీలు తగిలించుకుని సుబ్రమణ్యస్వామి చిత్రపటం ఉంచిన రథాన్ని లాగి తన భక్తిని చాటారు. మొదట పట్టణంలోని బసాపురం వద్ద రథానికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రథాన్ని కొక్కీలతో వీపునకు తగిలించుకుని పట్టణంలోని సెంటర్, కేజీఎఫ్ బస్టాండ్లు, ఎంజీ రోడ్డు మీదుగా ఆంజనేయస్వామి వరకు రథాన్ని లాగుతూ వెళ్లాడు. అనంతరం ప్రత్యేక పూజలు చేయించుకుని కావళ్లతో తిరుత్తణి బయలుదేరి వెళ్లారు. రథాన్ని మురళి లాగడాన్ని పలువురు ఉత్సుకతతో తిలకించారు.

అన్ని వర్గాలు ఐక్యంగా ఉండాలి

వి.కోట: మండలంలో అన్ని వర్గాలు ఐక్యంగా ఉండి హిందూ–ముస్లింలు సఖ్యతతో మెలగాలని తహసీల్దార్ ఉదయ్ సంతోష్, సీఐ సోమశేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఐ ఆధ్వర్యంలో వి.కోట పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. వి.కోటలో అనూహ్యమైన సంఘటనలు చోటుచేసుకుని అల్లర్లకు పాల్పడిన ఘటన జరిగి ఏడాది అయిన నేపథ్యంలో గత అనుభవాలను అధికారులు గుర్తు చేసుకున్నారు. వి.కోటలో వర్గ, వర్ణ, కులమతాలకు అతీతంగా వర్తక, వాణిజ్య, శ్రామిక, కర్షక వర్గాల వారందరూ ఐక్యంగా ఉంటున్నారని, ఈ వాతావరణాన్ని ఇలా కొనసాగించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎవరి ఇళ్లలో ఏ పండగైనా మతాలకతీతంగా అందరూ పరస్పరం సహకరించుకోవాలన్నారు. అలాగే పట్టణంలోని వేణుగోపాలస్వామి గుడి వీధిలో మాంసవిక్రయాలు జరుగుతున్నాయని, గతంలో పెద్దల కుదిర్చిన ఒప్పందాన్ని కొందరు లెక్కచేయకుండా దుకాణాలు నిర్వహిస్తుండటంపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాక రాబోవు వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వినాయక ప్రతిమలపై చర్చించారు. అలాగే పండగకు సంబంధించి ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టరాదని నిర్ణయించారు. కార్యక్రమంలో ఎస్ఐ జావిద్ బాషా, ఎంపీడీఓ ఈశ్వరన్, పీస్ కమిటీ సభ్యులు బాలగురునాథ్, రామచంద్ర, తమీమ్, విజయ్, రంగనాథ్, సుబ్బన్న, శివ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

13న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఆరీఫా షేక్

పుంగనూరు: రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటి ఆదేశాల మేరకు వచ్చే నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్‌జడ్జి ఆరీఫా షేక్ తెలిపారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు, అధికారులకు జడ్జి సమావేశం నిర్వహించి మాట్లాడారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించే కేసులపై అప్పీల్ ఉండదని, రాజీకి అనువైన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరిస్తామన్నారు. కేసులతో కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ, కాలం వృథా చేసుకోకుండా ఉండేందుకు లోక్ అదాలత్ సేవలను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు.

కట్ట మొరవను తెగ్గొట్టడంపై ఎమ్మెల్యే సీరియస్



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



నేతలు తెగ్గొట్టిన పలమనేరు పెద్దచెరువు మొరవను మట్టితో పూడ్చిన ఇరిగేషన్ అధికారులు

- అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష
- పెద్దచెరువుకట్ట మొరవ నీరు నిలుపుదలకు ఆదేశం
- నేతలు తెగ్గొట్టిన కట్టకు మట్టి వేసి పూడ్చిన ఇరిగేషన్ శాఖ

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: పట్టణంలోని పెద్ద చెరువు తూమును కొందరు అధికార పార్టీ నేతలు జేసీబీతో తెగ్గొట్టడంతో చెరువులోని చేపపిల్లలు కౌండిన్య నదిపాలయ్యాయి. దీనిపై సాక్షి దినపత్రికలో 'కౌండిన్య నదిలోకి చేపపిల్లలు' శీర్షికతో సోమవారం ప్రచురించిన కథనంపై ఎమ్మెల్యే అమరనాథరెడ్డి స్పందించారు. తన కార్యాలయంలో స్థానిక ఇరిగేషన్, మున్సిపల్, మత్స్యశాఖ అధికారులకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అధికారులకు తెలియకుండా ఎవరో నీటిని వదిలేస్తే ఏం చేస్తున్నారని వారిపై మండిపడ్డారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. దీంతో చెరువు కట్ట తూము వద్ద తెగ్గొట్టిన చోట అధికారులు మట్టి వేసి, చెరువులోని నీరు పోకుండా చర్యలు తీసుకున్నారు. సమావేశంలో కమిషనర్ రమణారెడ్డి, ఇరిగేషన్ ఏఈ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ ఇన్బునాథన్, డీఈ చోక్లానాయక్ తదితరులు పాల్గొన్నారు. ఇక, కట్ట మొరవ తెగ్గొట్టడంపై స్థానిక శ్రీనివాస మత్స్యకార సొసైటీ నిర్వాహకులు శ్రీధర్ పోలీసులకు ఫిర్యాదు చేయడం విదితమే. అక్రమార్కుల కారణంగా పలమనేరు పెద్దచెరువు, బొమ్మిదొడ్డి చెరువుల్లో రూ.లక్షల విలువైన చేపపిల్లలు కౌండిన్య నదిలోకి చేరడంతో నష్టపోయారు.

జూనియర్ కాలేజీలో సమస్యలకు మోక్షం





కళాశాల వద్ద రెడీ చేసిన టాయ్‌లెట్లు , మినరల్ వాటర్ తాగుతున్న విద్యార్థిని

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: పట్టణంలోని టీకేసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలకు మోక్షం లభించింది. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పథకం కింద నిర్మించిన టాయ్‌లెట్లను ప్రారంభించారు. దీంతోపాటు అక్కడ మినరల్ వాటర్ ప్లాంట్‌ను సైతం సిద్ధం చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడి కళాశాలలో నెలకొన్న సమస్యలపై సాక్షి దినపత్రికలో మంగళవారం 'ప్రాభవం కోల్పోతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల' శీర్షికతో ప్రచురించిన కథనంపై ప్రిన్సిపాల్ కన్నయ్యశెట్టి స్పందించారు. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి టాయ్‌లెట్లను ప్రారంభించారు. దీంతోపాటు చిన్నపాటి మరమ్మతులకు గురైన వాటర్‌ప్లాంట్‌ను సిద్ధం చేశారు. కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలను సైతం తొలగించారు.

సర్వే పూర్తి చేశాం

–త్వరలో పనులు చేపడుతాం

సాక్షి ఎఫెక్ట్..

చౌడేపల్లె: కాగతి చెరువులో ప్రమాదకరంగా వాలిపోయి పడిపోయే స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాలపై సర్వే పూర్తి చేశామని ట్రాన్స్‌కో ఏఈ శశిధర్ మంగళవారం తెలిపారు. సాక్షిలో ×ప్రమాదం జరిగినా పట్టించుకోరా..? శీర్షికతో ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. సిబ్బందితో కలిసి కాగతి చెరువులో ప్రమాదకరంగా వాలిపోయిన స్తంభాలను గుర్తించారు. ఆ స్తంభాలు వాలిపోకుండా సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేస్తామని, అలాగే కొలింపల్లె, కరణంవారి పల్లె సమీపంలో తక్కువ ఎత్తులో ఉన్న కరెంటు తీగలను సరిచేస్తామని చెప్పారు.

మద్యం బార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు: పట్టణంలో మద్యం బార్ లైసెన్సుకు ఆసక్తి గల వ్యాపారులు ఈనెల 26వ తేదీ సాయంత్రం లోపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తమున్సిపాలిటీకి కేటాయించిన బార్‌కు రూ.5.10 లక్షలు నాన్–రీఫండబుల్ ధరావత్తు చెల్లించాలన్నారు. అలాగే మొదటి సంవత్సరం లైసెన్సుకు రూ.55 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను ఈనెల 28న జిల్లా కలెక్టర్ సమక్షంలో చిత్తూరులోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో లాటరీ పద్ధతిలో కేటాయిస్తారని తెలియజేశారు.

నేటి నుంచి గ్రామసభలు

సదుం: గత మామిడి సీజన్‌లో తోతాపురి మామిడి విక్రయించిన రైతులకు ప్రభుత్వం ఇవ్వనున్న రాయితీ ధరకు అర్హత పొందిన రైతుల వివరాలు ధృవీకరించేందుకు బుధవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. 20న అమ్మగారిపల్లె, పాలమంద, కంభంవారిపల్లె, ఊటుపల్లె, 21న సదుం, నడిగడ్డ, చెరుకువారిపల్లె, ఎర్రాతివారిపల్లె, 22న తిమ్మానాయనపల్లె, బూరగమందలో సభలు నిర్వహించనున్నట్టు తెలియజేశారు. మామిడి రైతులు పాల్గొని తమ వివరాలను సరిచూసుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలిపితే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆదర్శ పాఠశాల స్థలాన్ని సర్వే చేయండి

–డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి

రొంపిచెర్ల: రొంపిచెర్ల ఆదర్శ పాఠశాల స్థలాన్ని రెండ్రోజుల్లో సర్వే చేసి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి తహసీల్దార్ అమరనాథ్‌ను ఆదేశించారు. ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఆటస్థలం మంజూరు చేయాలని అధికారులు జిల్లా కలెక్టర్‌కు గత నెల తల్లిదండ్రుల సమావేశంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో జేసీ ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఆదర్శ పాఠశాల పక్కనే ఆట స్థలానికి స్థలం ఉన్నప్పటికీ మరలా ఎందుకు స్థలం కోరారని ప్రిన్సిపాల్ రెడ్డి ప్రదీప్‌ను ప్రశ్నించారు. స్కూలు పక్కనే ఖాళీగా ఉన్న 2 ఎకరాల భూమిని చదును చేసుకోవచ్చని, అయితే స్కూలుకు స్థలం ఎక్కువగా ఉంటే ప్రభుత్వం ఇతరత్రా పథకాల అమలుకు దీనిని వినియోగించుకుంటుందన్నారు. ఆదర్శ పాఠశాల పక్కనే జాతీయ రహదారికి ఆవలివైపు మరో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అయితే హైవే దాటుకుని విద్యార్థులు వెళ్లడం సరికాదని, దీనిని దృష్టిలో ఉంచుకుని స్కూలు పక్కనే ఉన్న భూమినే ఆటస్థలంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. స్కూలుకు స్థలం ఎంత ఉందో సర్వే చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, వీఆర్వో సురేంద్ర, సర్వేయర్ పాల్గొన్నారు.



ఆదర్శ పాఠశాలను సందర్శిస్తున్న డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి

యథేచ్ఛగా గ్రానైట్ అక్రమ రవాణా

- పలమనేరు మీదుగా పొరుగు రాష్ట్రాలకు గ్రానైట్
- మైనింగ్ కార్యాలయం ముందే క్వారీ దిన్నెలు వెళుతున్నా పట్టించుకోని వైనం
- అక్రమాలపై నోరు మెదపని మైనింగ్ అధికారులు

పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొందరు పచ్చనేతల పంట పండుతోంది. ఎవరు దేంట్లో సంపాదించుకోవాలో ఎలాంటి అభ్యంతరాలు లేకుండా కొల్లగొట్టేస్తున్నారు. దీంతో కుప్పం ప్రాంతంలో అక్రమ మైనింగ్ ఇప్పటికే పెట్రేగిపోతోంది. ఇక పలమనేరు ప్రాంతంలో జల్లి క్వారీలు అనధికారికంగా సాగుతూనే ఉన్నాయి. ఇక్కడి హైవేలో గ్రానైట్, గ్రావెల్ లోడ్లకు లోడ్లు గంటకు పదిచొప్పున వెళుతున్నాయి. వీటిని స్థానిక మైనింగ్ అధికారులు కన్నెత్తికూడా చూడడం లేదు. మరోవైపు ఇక్కడ జరుగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే పనులకో సమంటూ అడవుల్లోని గుట్టలను సైతం బ్లాస్టింగ్ చేసి జల్లిని వాడుకుంటున్నారు. వీరికి ఎవరు అనుమతులిచ్చారో చెప్పేవారే లేరు. ఇలా ఉండగా పుంగనూరు ప్రాంతం నుంచి తమిళనాడుకు పలమనేరు మీదుగా మైనింగ్ కార్యాలయం ముందే రేయింబవళ్లూ అనే తేడా లేకుండా గ్రానైట్ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది.





పలమనేరు మీదుగా తమిళనాడుకు హెవీ టన్నేజీ లారీలో తరలిస్తున్న గ్రానైట్

జోరుగా గ్రానైట్ రవాణా

పలమనేరు మైనింగ్‌శాఖ పరిధిలో పలుచోట్ల అక్రమ క్వారీలున్నాయి. వీటిల్లో వేటికి లైసెన్సులున్నాయి? ఏవీ అక్రమంగా నడుస్తున్నాయి? అనే విషయం కూడా ఇక్కడి మైనింగ్ అధికారులు తెలియడం లేదంటే వీరి విధి నిర్వహణ ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఎక్కడపడితే అక్కడ మైనింగ్ తవ్వకాలు సాగుతున్నాయి. మరోవైపు తమిళనాడు రాష్ట్రానికి రాత్రిపూట అనుమతులు లేని గ్రానైట్ దిన్నెలను లారీల్లో తరలిస్తూనే ఉన్నారు. భారీ టన్నేజి గల వాహనాలు ఈ మార్గంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమిళనాడుకు చేరుతున్నాయి. దీనిపై వివరణ కోరేందుకు స్థానిక మైనింగ్ కార్యాలయానికి రెగ్యులర్ ఏడీ లేరు. చిత్తూరు ఏడీని ఇక్కడికి ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన ఎప్పుడు ఇక్కడి కార్యాలయానికి వస్తారో ఎవరికీ తెలీదు. ఫోన్ చేసినా అందుబాటులోకి రావడం లేదు.

రాయితీపై పశుగ్రాస విత్తనాలు

చౌడేపల్లె: రాయితీ ధరకు పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు పశువైద్యాధికారి ప్రసాద్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండలానికి మొత్తం 10 టన్నుల మొక్కజొన్న, ఎర్రజొన్న విత్తనాలు వచ్చాయని, ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వీటిని త్వరలో విక్రయిస్తామన్నారు. మొక్క జొన్న కేజీ రూ.17, ఎర్రజొన్న రూ.23 చొప్పున రాయితీపై పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, రైతులు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జెరాక్స్‌తో వచ్చి కొనుగోలు చేయవచ్చని తెలియజేశారు.